ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 13-10-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వినయం, నమ్రత, నాగరికత, సభ్యత, అణకువ లేని మనిషికి జ్ఞానం కలుగదు. ఇవి లేని మనిషికి చదివినా, అడిగి తెలుసుకొన్నా, సాధన చేసినా జ్ఞానం కలుగదు. పుణ్యక్షేత్రాలలో మనం ఏదైనా మంచి పని చేస్తే అధికంగా మంచి ఫలితం వస్తుందని చెపుతారు. పుణ్యక్షేత్రాలలో ఎవరికైనా చెడు చేస్తే చెడ్డ ఫలితం కూడా అధికంగా వస్తుందా అని ప్రశ్న. మహర్షుల దగ్గరికి, పుణ్యక్షేత్రాలకు వెళ్ళినపుడు మంచి చేస్తే మంచి ఫలం అధికంగా వస్తుంది అదే విధంగా చెడు చేసినపుడు చెడు ఫలం కూడా అధికంగా వస్తుంది అని వేరే చెప్పనక్కరలేదు. పవిత్ర స్థలాలలో కొంచం మంచి చేసినా అధిక పుణ్యం వస్తుంది అదే విధంగా కొంచం దోషం చేసినా అధికమైన పాపం వస్తుంది. కర్తృత్వభావన, నేను చేస్తున్నాను అనే భావన ఉన్నంతకాలం, ఉపాధికి పరిమితమై ఉన్నంతకాలం చెడుకు చెడు, మంచికి మంచి అనుభవించవలసిందే. ఉపాధి రహితునికి కర్తృత్వబుద్ధి కలుగదు. ఉపాధి సహితునికి అంటే ఉపాధికి పరిమితమైన వాడికి తప్పనిసరిగా కర్తృత్వ బుద్ధి కలుగుతుంది. ఎద్దు కదిలినపుడు బండి చక్రం ఏవిధంగా దాని వెనకాల వస్తుందో, మనిషి వెంట నీడ ఏవిధంగా వస్తుందో అలాగ నీవు కర్తృత్వబుద్ధితో పని చేస్తూ ఉంటే ఆ పని వలన వచ్చే ఫలం నీ శరీరం మరణించిన తరువాత నీవు ఏ లోకంలో ఉన్నా నిన్ను ఆ కర్మఫలం వెంటాడుతుంది.

నీకు అన్ని గొడవలు కావాలి కాని అన్ని గొడవలు సేకరిస్తున్న ఈ నేను ఎవరో నీకు తెలియదు. నీకు మంచితనం లేకపోతే, పూర్వ పుణ్యబలం లేకపోతే నిన్ను నీవు తెలుసుకోవాలనే బుద్ధి కూడా నీకు కలుగదు. ఎవడైతే సంకల్పాన్ని విడిచిపెడతాడో వాడు యోగి కాగలడు గాని సంకల్పాన్ని త్యాగం చేయలేని వాడు యోగి కాలేడు అని గీతలో చెప్పాడు. మీకు కోరిక వస్తోంది. అది మీ లోపల నుండే వస్తోంది. మీరు సంకల్పించటం వలన కోరిక వస్తోంది. సంకల్పించకపోతే కోరిక రాదు. సంకల్పించిన తరువాత మనిషికి కోరిక వస్తోంది. అయితే సంకల్పం ఎక్కడ నుండి వస్తోంది. కర్మ చేసి వదిలివేస్తే నీకు సంకల్పం రాదు. కర్మ ఫలాన్ని ఆశించటం వలన, కర్మ ఫలాన్ని ఊహించటం వలన సంకల్పం వస్తోంది. సంకల్పంలో నుండి కోరిక వస్తోంది. ఆ కోరిక వలన పని చేస్తావు. పని వలన ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని ఆశించటం వలన సంకల్పాలు వస్తాయి.

సాధన చేసే వాడికి అలవాట్ల నుండి బయటపడాలనే ఉంటుంది గాని అందులో నుండి విడుదల పొందలేకపోతున్నాడు. ఎందుచేత? దురభ్యాసములను పోగొట్టుకొనే నిమిత్తం పురుష ప్రయత్నం చేయాలి. దురభ్యాసముల నుండి నీవు బయటపడటానికి 3 అంగాలు ఉండాలి. 1. నీవు చేసే ప్రయత్నం 2. దేవుని కృప 3. అదృష్టం. దురలవాట్ల నుండి బయట పడటానికి కేవలం నీ తెలివితేటలు సరిపోవు. సాధన ఒక్కటే సరిపోదు. సాధన అవసరము ప్రయత్నం అవసరము. సాధన అనేది ఒక అంగం మాత్రమే. నీవు చేసే ప్రయత్నం చేయాలి. ఏ దురభ్యాసముల నుండి బయటపడాలనుకొంటున్నావో దానికి అనుగుణంగా నీ మనస్సును, ఇంద్రియాలను, దేహాన్ని తీర్చిదిద్దుకోవాలి అంటే నిన్ను నీవు సంస్కరించుకోవాలి. నీ ప్రయత్నంతో పాటు దేవుని కృప ఉండాలి. దేవుని కరుణతోపాటు నీవు పూర్వజన్మలో చేసిన పుణ్యం, సత్కర్మ నీ చేతికి అందాలి. పూర్వజన్మలో చేసిన పుణ్యం, సత్కర్మ నీకు అదృష్టంగా వస్తుంది. ఇన్ని రకాలుగా నీకు కలిసివస్తే

నీవు దురభ్యాసముల నుండి బయటపడతావు.

మీరు ఈ లోకమునకు ఉపకారం చేయాలంటే, మేలు చేయాలంటే ఆత్మ జ్ఞానాన్ని సంపాదించండి. మీరు ఆత్మ జ్ఞానాన్ని, ఆత్మ శాంతిని సంపాదిస్తే మీ ద్వారా కొన్ని లక్షలమంది బాగుపడతారు. ఒక జ్ఞాని దగ్గరకు వెళితే జ్ఞానాన్ని, ప్రేమని పంచిపెడతాడు. లౌకికుడు దగ్గరకు వెళితే వాడి దగ్గర జ్ఞానం లేదుకదా వాడు ఏమి చేస్తాడు. వాడు ద్వేషాన్ని, అసూయని, కక్షని పంచిపెడతాడు. వాడి దగ్గర ఉన్నది ఇస్తాడు గాని లేనిది ఎలా ఇవ్వగలడు. సత్పురుషులతో సహవాసం చెయ్యండి, సత్యవస్తువు గురించే మాట్లాడుకోండి. ఏ వస్తువు అయితే అంతటా వ్యాపించి ఉందో, దేనికైతే చావు పుట్టుకలు లేవో ఆ వస్తువును పొందటం కోసం ఉపాయం గురించి భక్తుల ఇంటికి వెళ్ళి మాట్లాడుకోండి. ఏకాంతవాసం మంచిదే. ఏకాంతవాసంలో మనలోని బలహీనతలు తెలుస్తాయి. మీరు భగవదనుభవం పొందటం కోసం మీకు వచ్చే తలంపులు, ఆలోచనలు, మాట్లాడే మాటలు మీకు ఉపయోగపడేలా చూసుకోండి. Every thought, Every feeling, Every word must be directed towards God.

మీరు భక్తుల దగ్గరకు, జ్ఞానుల దగ్గరకు వెళ్ళినపుడు ఏ పనిమీద వెళ్ళారో ఆ పని మర్చిపోకూడదు. ఒక భక్తుడు ఇంకొక భక్తుడి దగ్గరకు వెళ్ళినపుడు అంతటా వ్యాపించి ఉన్న ఆ పరమాత్మ గురించి తెలుసుకోవటానికి ఒకరికొకరు సహకరించుకోవాలి. మీ ఇద్దరి స్నేహం వలన మీరు పతనమయ్యేలాగ ఉండకూడదు. ఇద్దరూ బాగుపడేలాగ ఉండాలి. ఈ ప్రపంచం అంతా దేనియందు కల్పించబడిందో ఆ సద్వస్తువును తెలుసుకోవటానికి మీ చర్చలు సహకరించేలాగ ఉండాలి. వాసన చాలా బలీయమైనది. వాసన నశిస్తే కాని ఆత్మజ్ఞానము కలుగదు. వాసన నశించాలంటే సత్కర్మ చేయాలి, సత్పురుషులతో సహవాసం చేయాలి, సద్గోష్టి విడిచిపెట్టకూడదు. ఇన్ని రకాలుగా చేస్తే వాసన నశిస్తుంది.ఏ నేనును అయితే అన్ని వాసనలు అంటిపెట్టుకొని ఉన్నాయో ఆ నేను అనే తలంపుకు మూలం నీ హృదయంలో ఉంది. నీ శక్తి అంతా ఆ మూలంలో కేంద్రీకరించాలి. నీవు చేసే ప్రయత్నం ఫలించాలి అంటే దేవుడు అనుకూలించాలి. దేవుడు అనుకూలించకపోతే నీ ప్రయత్నం ఫలించదు. నీవు చేయగలిగిన ప్రయత్నం చెయ్యి. నీవు చేసే ప్రయత్నం చేయకుండా దైవం అనుకూలించాలి అంటే ఎలా అనుకూలిస్తాడు. ఎంతోకొంత ప్రయత్నం చెయ్యి. అప్పుడు దైవం అనుకూలిస్తాడు. దేవుని స్మరిస్తే ఆయన కృప నీకు కలుగుతుంది. దానివలన నీలోని వాసనలు నశిస్తాయి.

లోకం అంతా ఈశ్వర విలాసం అంటున్నారు. అంతా బ్రహ్మమే అంటున్నారు కదా ఇంక ఈ దురలవాట్లను పోగొట్టుకోవాలి అని అనటం ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. నీ శరీరం మీద కురుపు వేసింది అనుకో. నా శరీరం మీదే కదా కురుపు వేసింది అని వూరుకొంటావా, వూరుకోవు. ఎందుచేతనంటే ఆ కురుపు వలన నీకు బాధ కలుగుతుంది. అందువలన దానిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేస్తావు. మందుల వలన తగ్గకపోతే సర్జరీ చేసి దానిని తొలగించుకొంటావు. నీ శరీరంపైన వచ్చిన కురుపును పోగొట్టుకోకపోతే నీ శరీరం అంతా కుళ్ళిపోతుంది. నీ దురలవాట్లు కూడా ఆ పుండు వంటివే. వాటిని తొలగించుకోకపోతే అనేక రకాల బాధలను తీసుకొని వస్తాయి. నీ శరీరం మీద ఉన్న పుండును తొలగించుకోవటానికి నీవు ఎలా ప్రయత్నం చేస్తున్నావో అలాగే నీ మనస్సులో ఉన్న దుర్గుణాలను పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి. లేనిచో అవి అనేక నీచజన్మలకు కారణం అవుతాయి. శారీరక అనారోగ్యం కంటే మానసిక అనారోగ్యం పోగొట్టుకోవటం చాలా కష్టం. దీనికి సాధన అవసరం, ఈశ్వరానుగ్రహం అవసరం. శరీరంలో ఉన్న రోగాల వలన నష్టం లేదు ఆ రోగాలు అన్నీ స్మశానంలో శరీరం కాలిపోయినపుడు అవి కూడా కాలిపోతాయి. నీ మనస్సులో ఉన్న దోషాలు, దురలవాట్లును భౌతికమైన అగ్ని కాల్చలేదు. నీ మనస్సులో ఉన్న బలహీనతలు వేలాది పునర్జన్మలకు కారణం అవుతాయి.

ఉన్నది చైతన్యమే కదా ఇంక సాధన చేసేది ఎందుకు? ఉన్నది చైతన్యం ఒక్కటే కాని మనకు చైతన్యంతో తాదాప్యం లేదు. దేహంతో తాదాప్యం ఉంది, మనస్సుతో తాదాప్యం ఉంది. మంచి చెడ్డలు మనస్సులో ఉన్నాయి. చైతన్యంలో చావు లేదు, పుట్టుక లేదు, అసలు కాలమే లేదు. ఈ సృష్టి ఏర్పడక ముందు ఏ వస్తువు అయితే ఉందో ఆ వస్తువే చైతన్యం. దానితో నీవు తాదాప్యం చెందితే ఈ సృష్టిని దాటి వెళ్ళిపోతావు. మనస్సు ఉంటే మంచి చెడ్డలు ఉన్నాయి, పునర్జన్మ ఉంది, నీవు ఉన్నావు, నేను ఉన్నాను, ఈశ్వరుడు ఉన్నాడు అంతా ఉంది. అది లేకపోతే ఏదీ లేదు. మంచి చెడ్డలు అనేవి ద్వంద్వాలు. ఈ ద్వంద్వాలులో ఉన్నంతసేపు మనిషి నలిగిపోతాడు. చైతన్యానుభవం కలిగితేనే గాని వీటిలో నుండి బయటపడలేడు. మనస్సు నశిస్తే చైతన్యము నీకు వ్యక్తమవుతుంది. ఆ చైతన్యము నీ మనస్సు యొక్క మూలంలోనే ఉంది. నీ సర్వ శక్తిని, యుక్తిని, నీ పూజను, నీ ధ్యానాన్ని అంతా నీ మనస్సు యొక్క మూలం మీద కేంద్రీకరించు. అప్పుడు మనస్సు నశిస్తుంది. చైతన్యం నీకు వ్యక్తమవుతుంది.

పూజలో ఏమీ లేదు అని తెలియటానికే పూజ చేయటం, ధ్యానంలో ఏమీ లేదు అని తెలియటానికే ధ్యానం చేయటం. ఉన్నది అంతా నీ హృదయంలోనే ఉంది. పూజ, జపం, ధ్యానం, సత్కర్మ చేయగా చేయగా అందులో ఏమీ లేదు అని తెలుస్తుంది. పొందవలసినది ఇదికాదు పొందవలసినది వేరే ఉంది అని తెలుస్తుంది. సత్కర్మ చేయకపోతే తెలియదు. పొందవలసిన వస్తువును పొందింపచేయటం కోసం నీ బుద్ధి అటు మరలుతుంది అందుకని ఇవి అన్నీ చేయమన్నారు. భగవంతుడు సత్కర్మ చేయమన్నాడు కాబట్టి చెయ్యి దీనివలన లోకం బాగుపడుతుందా లేదా అన్నది నీకు అనవసరం. ముందు నీవు బాగుపడతావు. గాఢనిద్రలో ఉన్న నేను నిజమైన నేను. జాగ్రదావస్థలో ఉన్న నేను నిజమైన నేను కాదు. కాని మనం ఏమి అనుకొంటున్నాము అంటే గాఢ నిద్రలో ఉన్న నేను నిజం కాదు అనుకొంటున్నాము. రాగద్వేషాల మధ్యన, కక్షల మధ్యన గంతులు వేస్తున్న జాగ్రదావస్థలో ఉన్న నేను అనే తలంపు నిజమని అనుకొంటున్నాము. మాయ ఉంది కాబట్టి మనం భ్రాంతిలో పడుతున్నాము. మాయ యొక్క అధిపతిని నీవు ప్రత్యక్షం చేసు కొంటే ఆ మాయ నిన్ను విడిచిపెట్టేస్తుంది. మాయ నిన్ను విడిచిపెట్టేసినపుడు భ్రాంతి కూడా నశిస్తుంది. స్వర్గరాజ్యం నీ లోపల ఉంది అని యేసు చెప్పాడు. అంటే నీ శరీరంలో, నీ రక్తంలో, నీ కండరాలలో, నీ గుండెలో స్వర్గరాజ్యం లేదు. నీ హృదయంలో చైతన్యం ఉంది. అందులో స్వర్గరాజ్యం ఉంది. ఈ రోజు పచ్చగా ఉండి రేపు ఎండిపోయే వస్తువులలో అంటే ఈ రోజు తిరిగే శరీరం రేపు శవం అవ్వవచ్చు ఈ శరీరం లోపల స్వర్గరాజ్యం ఉంది అని కాదు. నీ హృదయంలో ఒక చావు లేని వస్తువు ఉంది. అందులో స్వర్గరాజ్యం ఉంది. అది నీ లోపల ఉన్నమాట నిజమే కాని అది నీ శరీరంలో ఒక భాగం కాదు.

సంసారం అంటే నీ మనస్సే సంసారం, ఇంట్లో ఉన్న వ్యక్తులు కాదు. ఇంట్లో ఉన్న మనుషులను విడిచిపెట్టి వెళ్ళిపోయిన నీ మనస్సు నీకూడ వస్తుంది. ఇంట్లో వ్యక్తులను విడిచిపెట్టినంత మాత్రం చేత నీకు జ్ఞానం కలుగదు. నువ్వు ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా నీ మనస్సుతో పోరాడి దానిని జయించాలి. నీ మనస్సు యొక్క మూలం తెలిస్తే కాని మనస్సును జయించలేవు. అందువలన నీ మనోమూలం మీదే నీ శక్తిని అంతా కేంద్రీకరించు. నీ సాధన చిందిపోకూడదు. డబ్బు సంపాదించాలంటే సంపాదించు, సత్కర్మలు చెయ్యి, దానాలు ధర్మాలు చెయ్యి ఇవి అన్నీ చెయ్యి. కాని ఇక్కడే ఆగిపోకు నీకు మోక్షం కావాలంటే ఇవి అన్ని చేసి మర్చిపో. అది చేసాను, ఇది చేసాను అని చేసిన పనులు జ్ఞాపకం పెట్టుకొంటే అసలు వస్తువు చేతిలో నుండి జారిపోతుంది. గింజలు జారిపోతాయి పొల్లు మిగులుతుంది.

★